క్లుప్తంగా

ఓ పాజిటివ్ రక్తదానం

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ఓ రోగికి అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా మురికి రాజు అనే వ్యక్తి స్పందించి రక్తదానం చేశారు. రక్తదాత మురికి రాజును ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు, సమూహం అధ్యక్షుడు జమీల్ హైమద్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న అభినందించారు.

కూలిన ఇల్లు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కుమ్మరి వాడలో శనివారం ఇల్లు కూలినట్లు బాధితురాలు కుమ్మరి దుర్గవ్వ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంటి పైకప్పు పూర్తిగా తడిసి పోయింది. దాంతో బాధితురాలు ఇంటిపై టార్పాలిన్ కవర్ కప్పారు. అయినా శనివారం సాయంత్రం కుప్పకూలింది. కూలిన ఇంటిని అధికారులు పరిశీలించి ఆదుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అభ్యర్థించారు.

బోరుమోటారుకు మరమ్మతులు



బాన్సువాడ: బీర్కూర్ మంజీర వద్ద ఉన్న బోరు మోటారుకు ఆదివారం గ్రామ పంచాయితీ సిబ్బంది మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ.. బీర్కూర్ మండల కేంద్రానికి మంజీర నుంచి మంచి నీరు సరఫరా చేసే 7.5 హెచ్‌పీ మోటారు చెడిపోవడంతో తాగునీటి సమస్య రాకుండా వెంటనే దాని స్థానంలో కొత్త మోటారు కొనుగోలు చేసి బోరులో వేశామని అన్నారు. మండల కేంద్రానికి ప్రతీ రోజూ మంజీర నీటిని సరఫరా చేస్తున్నామని ఆయన అన్నారు.

అమ్మవారి విగ్రహం కోసం భక్తుడి విరాళం



కామారెడ్డి అర్బన్: స్థానిక శ్రీజయదుర్గ వైద్యనాథేశ్వరస్వామి దేవాలయం అమ్మవారి విగ్రహం కోసం పట్టణానికి చెందిన వ్యాపారి చిట్టిమల్లి జగదీశ్వర్–పద్మ దంపతులు రూ.లక్షా 51 వేలు విరాళం ప్రకటించారు. పితృ అమావాస్య సందర్భంగా ఆదివారం వారు విశేష పూజలు చేశారు. అనంతరం దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు యాద అనిల్‌కుమార్, పాత ధర్మారాజు, ప్రభాకర్, నవబోతు శ్రీనివాస్, కూకుట్ల నగేష్ తదితరులు శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

అన్న ప్రసాద వితరణ



భిక్కనూరు: మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద అమావాస్య అన్నప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. ప్రతి అమావాస్యకు గాంధీచౌక్ వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సమితి ప్రతినిధులు తెలిపారు. అమావాస్య రోజున నిరుపేదలకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేయడం భగవంతునికి సేవ చేయడమే అవుతుందన్నారు.

తల్లి పేరిట మొక్కల నాటింపు



కామారెడ్డి అర్బన్: తల్లిపేరిట ఓ మొక్క నినాదంతో కామారెడ్డి హౌసింగ్‌బోర్డు కాలనీలో శ్రీసంకష్ట హర సిండికేట్, ఉదయ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించి వివిధ మొక్కలు నాటారు. సిండికేట్, అకాడమీల ప్రతినిధులు శ్రీధర్, నవీన్ కుమార్, మామిండ్ల సంతోష్, రవి ప్రసాద్, ప్రవీణ్, నవీన్, శ్రీకాంత్, భాను, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా లింకు రోడ్లు

- భారీ వర్షాలకు గుంతలమయంగా మారిన వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



గొడుగుమర్రి జీపీ రోడ్డు పరిస్థితి

రామారెడ్డి: మోషంపూర్ గ్రామం నుంచి పోసానిపేట గ్రామానికి లింక్ రోడ్డు ఉంటుంది. ఈ లింక్ రోడ్డు మీదుగా పోసానిపేటకు, జిల్లా కేంద్రానికి, మండల కేంద్రం రామారెడ్డికి మోషంపూర్ గ్రామస్తులు రాకపోకలు కొనసాగిస్తారు. కొన్నేళ్లుగా లింక్ రోడ్లను ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ లింక్ రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. రామారెడ్డి నుంచి కన్నాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు కంకర తేలింది. దీంతో మండల కేంద్రానికి వచ్చి పోయేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలను కలిపే లింకు రోడ్లు ఎన్నో ఉన్నాయి. ఈ లింకు రోడ్ల ద్వారా వెళ్తే దూర భారం తగ్గుతుందని ప్రజలు ఎక్కువగా ఈ లింకు రోడ్లపై నుంచే ప్రయాణాలు కొనసాగిస్తారు. గుంతలు పడి దారుణంగా ఉన్న లింకు రోడ్లపై ప్రయాణాలు కొనగిస్తూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు.

వర్షాలతో లింకు రోడ్లపై రాకపోకలు బంద్..

ఇటీవల వారం రోజులపాటు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో చాలా లింకు రోడ్ల పై రాకపోకలు బంద్ అయ్యాయి. నాలుగైదు రోజులుగా ఎండలు కొడుతుండడంతో ప్రయాణాలు ప్రారంభమైనా.. లింకు రోడ్లపై ఏర్పడ్డ గుంతలు, కంకర తేలిన రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రజలు జంకుతున్నారు. కనీసం గుంతలనైనా పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

తండాల పరిస్థితి మరీ దారుణం..

జిల్లా వ్యాప్తంగా 2017లో అప్పటి ప్రభుత్వం 500 జనాభా కల్గిన పల్లెలు, తండాలను కొత్త జీపీలుగా ఏర్పాటు చేసింది. 216 కొత్త జీపీలను ఏర్పాటు చేయగా అందులో ఎక్కువగా తండా పంచాయతీలే 176 ఉన్నాయి. ఏ తండాకు కూడా బీటి రోడ్లు లేవు. మట్టి రోడ్లపైనే నేటికీ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఇటీవలే గొడుగుమర్రి తండాకు బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభించి.. నిధులు రాక మధ్యలోనే వదిలేశారు.



పోసానిపేట-మోషంపూర్ లింకు రోడ్డు



కంకరతేలిన రామారెడ్డి కన్నాపూర్ లింకు రోడ్డు

రోడ్లు దారుణంగా తయారయ్యాయి



మోషన్ పూర్ -పాసానిపేట్ లింకు రోడ్డు దారుణంగా తయారైంది. ఈ మార్గంలో ఎక్కువగా మండల కేంద్రానికి ప్రయాణాలు కొనసాగిస్తాం. అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలి.

– కల్లెం రాజేందర్, మోషంపూర్

గుంతలమయంగా అడవిలింగాల రోడ్డు





అడవిలింగాల గ్రామానికి వెళ్లే దారిలో ఏర్పడిన గుంతలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని అడివిలింగాల గేట్ నుంచి అడవిలింగాల గ్రామానికి వెళ్లే 3 కిలో మీటర్ల రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రతి 10 మీటర్లకు నాలుగైదు గుంతలు ఉన్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయిని వాహనదారులు వాపోతున్నారు. గుంతల రోడ్డుపై ప్రయాణం వల్ల నడుము నొప్పులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం గుంతలను పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్యాచ్ వర్కులను పూర్తి చేస్తాం

అడివిలింగాల గేట్ నుంచి అడివిలింగాల గ్రామం వరకు ఉన్న రోడ్డుపై గుంతల పూడ్చి వేత పనులు వర్షాలు పడడం ఆగిపోగానే పూర్తి చేస్తాం. మెయింటెనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్స్ కింద పనులు చేపడతాం.

– గిరిధర్, డీఈ పంచాయతీరాజ్, ఎల్లారెడ్డి

డీ-11కు తాత్కాలిక మరమ్మతులు



బాన్సువాడ రూరల్: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, ప్రధాన కాలువకు వచ్చిన భారీ వరద మూలంగా జక్కల్‌దాని తండా శివారులోని డీ–11 వద్ద నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్ట బలహీనంగా మారింది. ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేసినప్పుడు లీకేజీ అవుతుండటం, కట్ట కోతకు గురై బుంగలకు ఆస్కారం ఏర్పడటంతో నీటిపారుదల శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. ప్రధాన కాలువ కట్టపై మొరంతో చదును చేయిస్తున్నారు. కాలువకు నీటిని వదిలి నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే శాశ్వత మరమ్మతులు చేయిస్తామని నీటిపారుదల శాఖ ఏఈ నితిన్ తెలిపారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ సంగం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఏ క్షణాన కూలుతుందో..?

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రం భవనంపైకప్పు పెచ్చులూడి పోతున్నాయి. తరచుగా వర్షాలు కురవడం వల్ల స్లాబ్‌పై నీరు నిలిచి ఉండడంతో భవనం పైకప్పునకు చెందిన పెచ్చులు ఊడిపోతున్నాయి. దీంతో వైద్యసిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే భవంలోకి నీరువచ్చి చేరుతున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని సిబ్బంది అంటున్నారు. భయపడుతూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిబ్బంది చెబుతున్నారు. ఈ ఉప ఆరోగ్యకేంద్రాన్ని ఇతర భవనంలోకి మార్చాలని, లేకుంటే నూతన భవనాన్ని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



పెచ్చులూడిన తాడ్వాయిలోని ఆరోగ్య ఉప కేంద్ర భవనం

తాడ్వాయి చర్చిలో శతాబ్ది ఉత్సవాలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని చర్చిలో ఆదివారం శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మెదక్‌లోని చర్చి ప్రారంభమై వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ప్రవచనాలు, ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ రవీందర్, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులంతా కలిసి తోడేశారు



గుండంను శుభ్రం చేస్తున్న కోడిచిర గ్రామస్తులు



ఖాళీ గుండాన్ని చూడటానికి వచ్చిన గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్): పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామస్తులు అందరూ నడుం బిగించి కోడిచిర గ్రామ శివారులోని చెన్నమ్మకోరి ఆలయ వద్ద గల గుండంలోని మొత్తం నీటిని తోడేసి శుభ్రం చేశారు. గుండంలో పేరుకుపోయిన మట్టి, ఇతర వస్తువులను తీయడానికి ఆదివారం గ్రామస్తులు, యువకులు కలిసి పొద్దంతా కష్టపడి తొలగించారు. ఈ గుండంలో అన్ని కాలాల్లోనూ నీరు ఉండటం విశేషం. గుండం ఖాళీ చేసి శుభ్రం చేస్తున్నారని తెలుసుకున్న గ్రామస్తులు చూడటానికి భారీగా తరలివచ్చారు.

ఘనంగా బతుకమ్మ పండుగ సంబురాలు



సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో రెండో రోజు బతుకమ్మ సంబురాలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చి ప్రధాన చౌరస్తాలు, ఆలయాల వద్ద బతుకమ్మలను ఉంచి పాటలు పాడి ఆడారు. అనంతరం కుంటలు, చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

జోరుగా ఇసుక దందా



- ఇందిరమ్మ ఇళ్లకు కొరత సృష్టిస్తున్న వైనం
- భారీగా ఇసుక డంపు చేసుకుంటున్న దళారులు
- టిప్పర్ల సాయంతో ఇతర ప్రాంతాలకు తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

రాజంపేట: మండలంలో ఇసుక దళారులకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. రాత్రి వేళల్లో, ప్రభుత్వ సెలవుదినాల్లో దళారులు ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రభుత్వం ఓ వైపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడితే ఇసుక దళారులకు మాత్రం దందానే పరమావధిగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. దీంతో నిజమైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక తిప్పలు తప్పడం లేదు. కొండాపూర్ పరిసర ప్రాంతాలతో పాటు గుండారం, పలు తండాలలో దళారులు అక్రమ ఇసుక రవాణాను కొనసాగిస్తున్నారు. రెవెన్యూ, అటవీ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక దళారులు కాసులు దండుకుంటున్నారు. కొందరు ఏకంగా తమ ఇంటి ముందు ఇసుకను డంపు చేసుకొని అనంతరం టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక దళారులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కోరుతున్నారు.

మాంసానికి భలే గిరాకీ



జిల్లా కేంద్రంలో మాంసం దుకాణాల వద్ద బారులు తీరిన జనాలు



ఎల్లారెడ్డిలో గుమిగూడిన జనాలు

కామారెడ్డిటౌన్/ఎల్లారెడ్డి:పెద్దల అమావాస్యతో పాటు ఆదివారం కావడంతో మాంసం దుకాణాల వద్ద జనాలు బారులు తీరారు. జిల్లా వ్యాప్తంగా మాంసం దుకాణాల వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీ గిరాకీ నెలకొంది. ఇదే అదునుగా సాధారణ రోజుల కంటే కిలో మాంసం రూ. 200 పెంచి మరీ విక్రయించారు.

శిథిల భవనాల్లో అసాంఘిక కార్యకలాపాలు



అడవిని తలపిస్తోన్న దోమకొండలోని పాత పోలీస్‌స్టేషన్ భవనం

దోమకొండ: గతంలో ప్రభుత్వ కార్యాలయాలుగా కొనసాగిన భవనాలు నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. దీంతో చుట్టుపక్కల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. దోమకొండలో గతంలో మసీదు సమీపంలో పాత పోలీస్‌స్టేషన్ భవనం ఉంది. 25 ఏళ్ల క్రితం ప్రస్తుతం ఉన్న పోలీస్‌స్టేషన్‌తో పాటు పోలీస్ క్వార్టర్స్‌ను నిర్మించారు. దీంతో పాత భవనం వృథాగా ఉండి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. భవనం చుట్టూ పెద్ద ఎత్తున మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. ఇది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం ప్రియులతో పాటు ఇతర పనులకు ఇది దోహదపడుతుందని వారు వాపోతున్నారు. రాత్రి వేళల్లో చుట్టుపక్కల కాలనీవారికి ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు.

ఆర్అండ్‌బీ భవనం సైతం..

మండల కేంద్రంలోని ముత్యంపేట రోడ్డులో ఆర్అండ్‌బీ భవనం సైతం శిథిలావస్థకు చేరుకుంది. దీనికి చుట్టు పెద్ద సంఖ్యలో మొక్కలు పెరిగాయి. గతంలో ఉమ్మడి దోమకొండ మండలంతో పాటు భిక్కనూరు, మాచారెడ్డి మండలాలకు మంత్రులు ఇతర ప్రముఖులు పర్యటనకు వస్తే ఇక్కడి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేసేవారు. కాని నేడు ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ కూడా రాత్రయితే చాలు మందు ప్రియులు వస్తున్నారు. ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చెట్లను తొలగించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

జల దిగ్బంధంలో గోజెగావ్



గోజేగావ్ వద్ద వంతెనపై నుంచి పారుతున్న వరద

మద్నూర్(జుక్కల్): మద్నూర్–గోజేగావ్‌కు ఆదివారం రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని గోజేగావ్‌కు వెళ్లే రహదారిలో ఉన్న లెండి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. లెండివాగుపై నిర్మించిన లోలెవల్ వంతెన పూర్తిగా మునిగిపోవడంతో మండల కేంద్రానికి వారికి రాకపోకలు నిలిచిపోయాయి. మండలంతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో సైతం భారీ వర్షాలు కురవడంతో లెండి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో గోజేగావ్ గ్రామస్తులు మండల కేంద్రానికి చేరుకోవాలంటే గోజేగావ్ నుంచి మహారాష్ట్రలోకి ప్రవేశించి దెగ్లూర్ మీదుగా 25 కిలోమీటర్లు ప్రయాణించి మద్నూర్‌కు చేరుకోవాలి. మండల కేంద్రం నుంచి నేరుగా గోజేగావ్‌కు వెళ్తే కేవలం ఎనిమిది కిలోమీటర్ల దూరం మాత్రమే ఉందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు, ఎమ్మెల్యే స్పందించి లోలెవల్ వంతెనను హైలెవల్‌గా నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



జిల్లా కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



బిచ్కుందలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..



బీబీపేటలో బాపూజీ వర్ధంతి నిర్వహిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

బిచ్కుంద/బీబీపేట/కామారెడ్డిక్రైం:స్వాతంత్ర్య సమరయోధుడు, బహుజనుల ఆశాజ్యోతి, రాజకీయ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శనీయుడని వక్తలు అన్నారు. ఆదివారం బిచ్కుంద, బీబీపేట మండలాల పరిధిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో.. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బాపూజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

పితృదోషాల నివారణకు శనేశ్వరస్వామికి పూజలు



శనిశింగనపురం శనేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కామారెడ్డి అర్బన్: పితృదోషాల నుంచి విముక్తి కోసం ఆదివారం పెద్దల అమావ్యాస సందర్భంగా కామారెడ్డి శ్రీశనైశ్వరాలయం వద్ద పెద్ద ఎత్తున భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శనైశ్వరస్వామికి ఇష్టమైన 19 ప్రదక్షిణలు చేసి నువ్వుల తైలంతో అభిషేకం నిర్వహించారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయ కమిటీ తరపున ఉచితంగా నువ్వుల తైలం, పూజ ద్రవ్యాలను అందిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు లింగాగౌడ్, రవీందర్‌రెడ్డి, యాద అనిల్‌కుమార్, పాత ధర్మారాజు అన్నారు. అనంతరం పెద్దల కోసం అర్చకులకు సాహిత్య దానం చేశారు.

కామారెడ్డి రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం పెద్దల అమావాస్యను ఘనంగా జరుపుకున్నారు. వివిధ రకాల వంటకాలు తయారు చేసి పెద్దలకు నైవేద్యంగా సమర్పించారు. ఆయా గ్రామాల్లోని పూజారులు, జంగమయ్యలకు బియ్యం అందజేశారు. అనంతరం పెద్దలను స్మరించుకుంటూ నైవేద్యాలు సమర్పించి విందు భోజనాలు ఆరగించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు మండపాలు ముస్తాబు



సర్వలో ముస్తాబవుతున్న దుర్గామాత మండపం



దోమకొండలో చాముండేశ్వరి ఆలయం



భిక్కనూరులో దుర్గాదేవి మండప స్వాగత తోరణం

సాక్షి నెట్‌వర్క్:శరన్నవరాత్రి ఉత్సవాలకు దుర్గామాత మండపాలు ముస్తాబయ్యాయి. నేటి నుంచి అక్టోబర్ 2 వరకు 9 రోజుల పాటు జరిగే నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ఒక్కో రోజు ఒక్కో రూపంలో అమ్మవారం భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే ఆలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.